


# 64 వ భాగం

## దక్ష ప్రజాపతి – 13

### దక్షయజ్ఞం పరిసమాప్తి

దక్షుడు బతికి లేచాడు కదా? మొదట్లో శివుణ్ణి తూలనాడిన ఆ తల పోయింది. ఇప్పుడు అహంకారం లేని మనసులో భగవంతుడు కనిపించాడు. తనకి ఉన్న అహంకారం, అది తనకి కలగచేసిన అపకారం అన్నీ గుర్తు ఉన్నాయి. ఎదురుగా తనకి అహంకారం తగ్గించిన వాడు నవ్వుతున్నాడు మనోహరంగా. అప్పుడేమౌతుంది? గొంతు గద్గదమై నోటమ్మట మాట రాదు కదా? ఇప్పుడు జరిగేది అదే.

వ. ఇట్లు లేచి నిలిచి ముందఱ నున్న శివునిం గనుంగొనిన మాత్రన శరత్కాలంబున నకల్మషంబైన సరస్సునుంబోలెఁ బూర్వ రుద్రవిద్వేష జనితంబు లైన కల్మషంబులం బాసి నిర్మలుండై యభవుని నుతియింపం దొడంగి మృతిఁ బొందిన సతీ తనయం దలంచి యనురా గోత్కంఠ బాష్పపూరిత లోచనుండును, గద్గదకంఠుండునునై పలుకం జాలక యెట్టకేలకు దుఃఖంబు సంస్తంభించుకొని ప్రేమాతిరేక విహ్వలుం డగుచు సర్వేశ్వరుం డగు హరున కిట్లనియె. [4-158]

ఇలా లేవగానే మొదటగా కనిపించిన శివుణ్ణి చూసి, శరత్కాలంలో కల్మషంలేని సరస్సులో నీటిలో లాగా, రుద్రుడిమీద ద్వేషం ఏమీ లేని మనస్సుతో, నిర్మలుడైన నీలకంఠుణ్ణి చూస్తూ స్తోత్రం చేయబోయాడు కానీ కంఠం గద్గదమై పోవడం చేత నోటమ్మట మాట రాలేదు. కాసేపటికి దుఃఖం అణుచుకుని భగవంతుడిమీద ప్రేమతో ఇలా అన్నాడు. అంటే పూర్తి అహంకారంతో ఉన్న ఆ మనస్సూ ఆ ఆలోచనలూ పోయాయి. ఇప్పుడున్న – కొత్త జన్మ వల్ల అహంకారం పోగానే భగవదనుగ్రం కలిగి, మనసులో ప్రేమ కలిగింది. శారీరకంగా అసలు తల ఏమైందో వదిలేసి చూస్తే, దక్షుడి మనసు, ఆలోచనలూ అన్నీ మారాయి. అహంకారం నాశనమైంది. అదే తల పోవడం అంటే.

క. వినుమ; నీ కపరాధుఁడ నగు
నను దండించు టది దండనము గాదు మది
న్నను రక్షించుటగా మన
మునఁ దలఁతును దేవ! యభవ! పురహర! రుద్రా! [4-159]

రుద్రా, నీకు అపరాధం చేసిన నన్ను శిక్షించడంలో ఉన్నది శిక్ష కాదు. అది నన్ను రక్షించడానికే అని అనుకుంటున్నాను. నిజం చూస్తే అసలు ఏమైంది దక్షుడికి? అహంకారంతో ఉన్న ఆతల పోయి, అణుకువగా ఉండే మరో తల వచ్చింది – అంటే మనసూ, ఆలోచనలూ పూర్తిగా మారాయి. ఎప్పుడైతే బలి లాగా పాప పుణ్య అహంకారాలు భగవంతుడికిచ్చాడో అప్పుడు, దక్షుడికి భగవంతుడి సాక్షాత్కారం అయింది.

సీ. అనఘాత్మ! తగ నీవు నబ్జనాభుండును;
బరికింపఁ బ్రాహ్మణాభాసు లయిన
వారల యెడల నెవ్వలన నుపేక్షింప;
రఁట! దృఢవ్రతచర్యు లైనవారి
యెడ నీకుపేక్ష యెక్కడిది? సర్గాదిని;
నామ్నాయ సంప్రదాయప్రవర్త
నము నెఱింగించుట కమర విద్యాతపో;
వ్రత పరాయణులైన బ్రాహ్మణులను [4-160]

తే. వరుసఁ బుట్టించితివి; కాన వారి నెపుడుఁ
గేల దండంబుఁ బూని గోపాలకుండు
బలసి గోవుల రక్షించు పగిది నీవు
నరసి రక్షించుచుందు గదయ్య రుద్ర! [4-160.1]

వేద సంప్రదాయాలు కలకాలం ఉండడానికి బ్రహ్మవేత్తలు సృష్టించబడ్డారు. కపటమైన బ్రహ్మవేత్తలని నువ్వూ, విష్ణువూ క్షమించరని తెలిసింది. విద్య, తపస్సు, వ్రతం అనేవి బ్రహ్మవేత్తల ధర్మాలు. వాటిని రక్షించించడానికి గోపాలుడు గోవులని రక్షించినట్టూ, వీళ్లని కాపాడుతూ ఉంటావు. ఇదంతా ఎందుకు చెప్తున్నాడంటే, తాను చేసిన తప్పులు ఒప్పుకున్నందుకూ, ఏ తలతో అయితే శివుణ్ణి నిందించాడో ఆ తల పోయి అహంకారం పోయినందుకూను. వామనావతారంలో చూసాం బలి చక్రవర్తి మూడు అడుగులనే పాప, పుణ్య, అహంకారాలు అర్పించగానే ఏమైందో.

సీ. తలపోయ నవిదిత తత్త్వవిజ్ఞానుండ;
నైన నాచేత సభాంతరమున
నతి దురుక్త్యంబక క్షతుఁడ వయ్యును మత్కృ;
తాపరాధము హృదయంబు నందుఁ
దలఁపక సుజన నిందాదోషమున నధో;
గతిఁ బొందుచున్న దుష్కర్ము నన్నుఁ
గరుణఁ గాచిన నీకుఁ గడఁగి ప్రత్యుపకార;
మెఱిఁగి కావింప నే నెంతవాఁడ? [4-161]

తే. నుతచరిత్ర! భవత్పరానుగ్రహాను
రూప కార్యంబుచేత నిరూఢమైన

తుష్టి నీ చిత్తమందు నొందుదువు గాక;
క్షుద్రసంహార! కరుణాసముద్ర! రుద్ర! [4-161.1]

సభామధ్యంలో నేను పరుషవాక్యాలు మాట్లాడినా, నేను చేసిన అపరాధం మనసులో ఉంచుకోక, బుధజనులని నిందిస్తూ అధోగతి పొందుతున్న నన్ను కరుణతో ఉద్ధరించావు. నాకు ఇటువంటి మహోపకారం చేసిన కరుణాసముద్రుడవైన నీకు ప్రత్యుపకారం నేను ఏం చేయగలను? ఇలా ఇతరులని ఉద్ధరించే కార్యాలవల్ల కలిగే ఆనందం నువ్వే పొందుదువు గాక. మొదట్లో శపించిన దక్షుడే ఇప్పుడు శివుడికి వరం ఇస్తున్నట్టూ అంటున్నాడు.

గురు శిష్య పరంపరలో ఇలా శిష్యులు అహంకారం కనబర్చడం, దాన్ని సమయం చూసి గురువు పోగొట్టడం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. ఓ సారి ఆ అహంకారం పోగానే మనసులో కలిగే ఆనందం వల్ల గురువంటే ఎప్పటికీ తీర్చుకోలేని పెద్ద ఋణం అని శిష్యులు చెప్పడం గమనించవచ్చు. ఓ శిష్యుణ్ణి "నీకు ఆత్మ దర్శనం, గురుసేవ అనే రెండింటిలో ఒకదాన్ని కోరుకోమంటే ఏది కోరుకుంటావు?" అని అడిగారు. శిష్యుడి సమాధానం ఏమిటంటే, "గురుసేవ తక్కెడలో ఒకవైపు వేసి, ఈ విశ్వంలో – ఆత్మ సాక్షాత్కారం తో సహా – ఉన్న మిగతావన్నీ రెండో వేపు వేసినా అసలు ఆ తక్కెడ తూగదు." ఇదే సరిగ్గా దక్షుడు చెప్తున్న 'మహోపకారం' అన్నది.

వ. అని యిట్లు రుద్రక్షమాపణంబు గావించి పద్మసంభవుచేత ననుజ్ఞాతుండై దక్షుం డుపాధ్యాయ ఋత్విగ్గణ సమేతుం డగుచుఁ గ్రతుకర్మంబు నిర్వర్తించు సమయంబున, బ్రాహ్మణజనంబులు యజ్ఞంబులు నిర్విఘ్నంబులై సాగుటకుఁ బ్రమథాది వీర సంసర్గ కృత దోష నివృత్త్యర్థంబుగా విష్ణుదేవతాకంబును ద్రికపాలపురోడాశ ద్రవ్యకంబును నైన కర్మంబుఁ గావింప నధ్వర్యుకృత్య ప్రవిష్టుం డగు భృగువు తోడం గూడి నిర్మలాంతఃకరణుం డగుచు దక్షుఁడు ద్రవ్యత్యాగంబుఁ గావింపఁ బ్రసన్నుండై సర్వేశ్వరుండు. [4-162]

ఇప్పటికి దక్షుడికి అహంకారం పోయి సరిగ్గా యజ్ఞం చేయాలనే ఆలోచన వచ్చింది కదా? అలాంటి నిర్మలమైన మనసుతో ఋత్విక్కులని ముందుంచుకుని, నిర్విఘ్నంగా యజ్ఞం పూర్తి చేసాడు. ఓ సారి మనసు నిర్మలం అయితే భగదనుగ్రం ఒక్క క్షణం కదా? ఎవరికీ యజ్ఞం? సర్వేశ్వరుడైన నారాయణుడికి. అలా యజ్ఞం పూర్తయ్యేసరికి – అంటే అహంకారం పూర్తిగా పోగానే – భగవంతుడు ప్రసన్నుడయ్యాడు.

ఇటువంటి కథల్లో మనం గమనించవల్సినదేమిటంటే, యజ్ఞం అనేది మన మనసుల్లో జరిగే నిరంతర మధనం. మంచి జరిగితే దేవుణ్ణి మెచ్చుకోవడం, లేకపోతే అసలు దేవుడే లేడనడం, ఆయన్ని నిందించడం ఇదంతా ఓ క్రమం. ఈ క్రమంలో ఒక్కోసారి అహంకారం వల్ల కళ్ళు కనపడక రకరకాలగా మిగతా వాళ్ళని నిందించడం, అవన్నీ జరిగాక ఏదో పెద్ద ఉపద్రవం వచ్చి – రోగం వల్లో, ఉన్న ఆస్తులూ అవీ పోవడం వల్లో, మరొకటో – అహంకారం మీద సమ్మెట దెబ్బ తగలవల్సిన చోట తగులుతుంది. దానితో మనసుకో శిక్ష పడి ఎలా సరిగ్గా ఆలోచించవచ్చో, కూడదో తెలిసి వస్తుంది. ఇదే యజ్ఞం అంటే. ఓ సారి మనసు నిర్మలం అయ్యాక, గురువు రూపంలో భగవంతుడు చేసిన రక్ష, సహాయం గుర్తు వచ్చి 'నేను కాదు నువ్వే," అనే స్థితికి చేరాక కలిగేదేమిటి? కృతజ్ఞత, ఎప్పటికీ తీర్చుకోలేని గురు ఋణం, ఆనందం, అదే సమాధి స్థితి, యజ్ఞం పూర్తి అవడం, భగవద్దర్శనం కావడం. ఇదే దక్షుడికి జరిగినది. ఈ కథలో తల పోవడం, మరో తల తగిలించడం అనేవి శారీరకంగా జరిగినవి కాక మనసులో జగిరిన మార్పులని అర్థం చేసుకుంటే చాలు.

సీ. మానిత శ్యామాయమాన శరీర దీ;
ధితులు నల్దిక్కుల దీటుకొనఁగఁ
గాంచన మేఖలా కాంతులతోడఁ గొ;

శేయ చేలద్యుతుల్ చెలిమి చేయ
లక్ష్మీసమాయుక్త లలిత వక్షంబున;
వైజయంతీ ప్రభల్ వన్నెచూప
హాటకరత్న కిరీట కోటిప్రభల్;
బాలార్క రుచులతో మేలమాడ [4-163]

తే. లలితనీలాభ్రరుచిఁ గుంతలములు దనరఁ
బ్రవిమలాత్మీయ దేహజప్రభ సరోజ
భవ భవామర ముఖ్యుల ప్రభలు మాప
నఖిలలోకైక గురుఁడు నారాయణుండు. [4-163.1]

యజ్ఞం పూర్తి అయింది కదా? ఇప్పుడు తనకి కలిగిన ఆత్మానుభవంలో కనిపించిన భగవంతుడెలా ఉన్నాడు? నల్లని మేని కాంతులు నాలుగు దిక్కుల్లో వ్యాపిస్తూ, బంగారు మొలత్రాడు కాంతులతో పట్టుబట్టల కాంతులు కలిసిపోగా, లక్ష్మికి కాపురమైన వక్షఃస్థలంపై వైజయంతీమాలతో , రత్నాలు పొదిగిన బంగారు కిరీటంతో సమస్త లోకాలకు గురువైన నారాయణుడు సాక్షాత్కరించాడు.

భాగవతం మొత్తంలో పోతన ఎన్నిసార్లు మహా విష్ణువుని వర్ణించినా ఒకే రకమైన పదాలు గమనించవచ్చు. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి తలనుంచి పాదాలదాకా వర్ణన, ఒక్కోసారి పాదాలనుంచి తలదాకా వర్ణన. కానీ భాష మాత్రం దాదాపు ఒకే రకంగా ఉండడం చూడవచ్చు.

చ. సలలిత శంఖ చక్ర జలజాత గదా శర చాప ఖడ్గ ని
ర్మల రుచులున్ సువర్ణ రుచిమన్మణి కంకణ ముద్రికా ప్రభా
వళులును దేజరిల్లు భుజవర్గ మనర్గళ కాంతియుక్తమై
విలసిత కర్ణికార పృథివీరుహముం బురుడింపఁ బిట్టుగన్. [4-164]

వచ్చినవాడు — పోతన దృష్టిలో ఎప్పుడూ కూడా – కిరీట, మకరకుండల కేయూర హార కటక కంకణ, కౌస్థుభ, మణిమేఖలాంబర వనమాలికా విరాజితుడు. శంఖ చక్ర, పద్మ, గద, శర, చాప, ఖడ్గాలని ధరించిన భుజవర్గం అనర్గళ కాంతి యుక్తమై ఉంది. ఇలా కనిపించిన విష్ణువు పైనుంచి కిందవరకూ పుష్పించిన కొండగోగు వృక్షంలాగా (కర్ణికార పృథివీ రుహము) ఉన్నాడు.

క. సరసోదార సమంచిత
దరహాస విలోకనములఁ దగ లోకములం
బరితోషము నొందించుచుఁ
బరమోత్సవ మొప్ప విశ్వబంధుం డగుచున్. [4-165]

మనసూ, అహంకారం ఓ సారి పోగానే కనిపించేది ఏమిటి? సరసమైన ఔదార్యంతో, చిరునవ్వుతో లోకాలన్నింటికీ సంతోషం కలిగించే విశ్వబంధువైన నారాయణుడు.

చ. మఱియును రాజహంస రుచిమద్భ్రమణీకృత తాలవృంత చా
మరములు వీవఁగా దివిజమానిను లచ్చసుధామరీచి వి
స్ఫురణ సితాతపత్ర రుచిపుంజము దిక్కులఁ బిక్కటిల్లఁగాఁ
గరివరదుండు వచ్చె సుభగస్తుతి వర్ణ సుపర్ణయానుఁడై. [4-166-]

అలా గరుడారూఢుడై (సుపర్ణయానుడై) వచ్చాడు కరివరదుడు (గజేంద్రమోక్షం కథ మరోసారి గుర్తు చేస్తున్నాడు పోతన), పున్నమి నాటి వెన్నెలు దిక్కులు పిక్కటిల్లేటట్టూ వ్యాపిస్తూండగా, దేవతా స్త్రీలు వింజామరలు వీస్తూండగా.

గజేంద్రమోక్షం గురించి వ్యాసంలో చూసాం. ఎప్పుడైతే మనలో 'ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై..." అనే పరిస్థితి వస్తే ఏమౌతుందో. అంటే ఎంతటి ప్రజాపతి అయినా గుర్తుంచుకోవాల్సినది – తాను కాదు చేసేది. చేసేదీ, చేయించేదీ అన్నీ ఆ భగవంతుడే. ఓ సారి ఆ స్థితి చేరుకోగానే "సిరికింజెప్పడు శంఖ చక్రయుగమున్ చేదోయి సంధింపడే పరివారమ్మును ..." అంటూ ఆయన పరుగుతో వస్తాడు. అలా ఆత్మ సాక్షాత్కారం కలగ్గానే మనసులో కలిగే అపరిమితమైన సంతోషమే ఈ దిక్కులు పిక్కటిల్లే పున్నమినాటి వెన్నెలలూ, సరసోదార సముంచిత దరహాసమూను.

చ. ఘనరుచి నట్లు వచ్చిన వికారవిదూరు ముకుందుఁ జూచి బో
రన నరవిందనందన పురందర చంద్రకళాధ రామృతా
శనముఖు లర్థి లేచి యతి సంభ్రమ మొప్ప నమో నమో దయా
వననిధయే యటంచు ననివారణ మ్రొక్కిరి భక్తియుక్తులై. [4.167]

అలా గొప్ప కాంతితోవచ్చిన వికారవిదూరుడైన (వికారాలు దరిచేరనివాడు) ముకుందుని, చూసి, బ్రహ్మ (అరవింద నందుడు, పద్మంలో పుట్టినవాడు), పురందరుడు (ఇంద్రుడు), చంద్రకళాధరుడు (పరమేశ్వరుడు), అమృతాశనముఖులు (అమృతం తినేవారు, దేవతలు) సంభ్రమంతో లేచి ఓ కృపాసముద్రుడా అంటూ (దయావననిధయే యటంచు) నమస్కారం చేసారు భక్తితో.

వచ్చే వ్యాసం లో మహా విష్ణువు దక్షుడితో త్రిమూర్తుల గురించి ఏం చెపుతాడో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS